క్లుప్తంగా

రూ.17 కోట్లతో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు



గజపతినగరంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు

గజపతినగరం: మండల కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో 30 పడకలుగా ఉన్న ఈ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా ఆధునికీకరణ చేస్తానని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న సమయంలో గజపతినగరం ప్రజలకు ఇచ్చిన మాటను ఈ రోజు అక్షరాలా నిలబెట్టుకున్నారు. 17కోట్ల రూపాయలతో శరవేగంగా ఆస్పత్రి నిర్మాణం పనులు పూర్తయిన తరువాత గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల రోగులకు అన్ని శస్త్రచికిత్సలు, వైద్యసేవలు సంపూర్ణంగా అందనుండడంతో నాలుగు మండలాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలి



దమరసింగిలో సిద్ధం కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మంచిని వివరించి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వద్దకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.వి.సూర్యనారాయణ రాజు, పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని సొలిపిసోమరాజుపేట, దమరసింగి, వల్లాపురం గ్రామాల్లో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన మంచి ప్రజలకు తెలియజేయాలన్నారు. మేము సిద్ధం మా బూత్ సిద్ధం కిట్లను స్థానిక నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్లు బెల్లాన బంగారునాయుడు, కెంగువ మధుసూధనరావు ఉన్నారు.

11, 12 తేదీల్లో మెరకతల్లి వారాల జాతర



శ్రీమెరకతల్లి అమ్మవారు

మెరకముడిదాం: మెరకముడిదాం, సోమలింగాపురం, ఎం.పాలెం గ్రామాల ఇలవేల్పు, కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీమెరకతల్లి అమ్మవారు వారాల జాతరను ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్టు మూడు గ్రామాలకు చెందిన ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వారాల జాతరను మూడు గ్రామాలలో వున్న ఆలయాలతో పాటు మూడు గ్రామాల మధ్యలో వున్న ప్రధాన ఆలయం వద్ద నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

పాము కాటుతో మహిళకు అస్వస్థత



పాముకాటుకు గురైన పూజారి గంగతల్లి

శృంగవరపుకోట: పుణ్యగిరి క్షేత్రంలో ఉన్న దారగంగమ్మ లోయలో అమ్మ వారికి నిత్యం పూజలు చేసే పూజారి గేదెల గంగతల్లి శుక్రవారం పాము కాటుకు గురైంది. శుక్రవారం ఉదయం దారగంగమ్మలోయ వద్ద పైన ఉన్న గుహలో ఆమె పూజ చేస్తున్న సమయంలో పాము కాటు వేసింది. దీంతో అక్కడే ఉన్న భక్తులు సమాచారం ఇవ్వటంతో స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందివ్వటంతో ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని స్థానికులు తెలిపారు.

మేము సిద్ధం - మా బూత్ సిద్ధం



వావిలపాడులో మేము సిద్ధం - బూత్ సిద్ధం అంటూ నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో బూత్ స్థాయిలో మేము సిద్ధం - మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు నేతృత్వంలో శుక్రవారం నిర్వహించారు. కుమ్మపల్లి, వావిలపాడు, తదితర బూత్‌లలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా కడుబండి శ్రీనివాసరావును, విశాఖ పార్లమెంటు సభ్యురాలుగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు మండల ప్రధాన కార్యదర్శి ద్వారపూడి గంగునాయుడు, నేతలు బీల సతీష్, చినబ్బినాయుడు, శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

హరహర మహాదేవ

- 'కోట'లో జాతరకు తరలి వచ్చిన భక్తులు
- శైవ క్షేత్రాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



ఎస్.కోట: పుణ్యగిరి మెట్ల మార్గంలో భక్తులు

శృంగవరపుకోట: ఓం నమఃశివాయ... హర హర మహాదేవ..శంభో శంకర... అంటూ భక్తజనుల శివ నామస్మరణతో పుణ్యగిరి సానువులు పులకించాయి. జిల్లా నలుమూలల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పుణ్యగిరి దారిపట్టారు. ముక్తిదాయకమైన పావన క్షేత్రం పుణ్యగిరిలో కొలువుదీరిన మహదేవుడు ఉమాకోటిలింగేశ్వరుడ్ని శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన దర్శించేందుకు బారులు తీరారు. శుక్రవారం పుణ్యగిరి దేవస్థానంలో తెల్లవారుజామున మూడు గంటలకు ఉమాకోటిలింగేశ్వరునికి పంచామృత అభిషేకాలు, అర్చనలు చేసి, 4.30గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా మూడు క్యూమార్గాల్లో దర్శనాలు కల్పించారు. శ్రీకాకుళం, విశాఖ, ఒడిశా జిల్లాల వారే కాక జిల్లాలో పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు వంటి ప్రాంతాల నుంచి భక్తులు పుణ్యగిరి క్షేత్రానికి వచ్చారు. పుణ్యగిరిలో భక్తులు పుట్టుదార, దారగంగమ్మలోయల్లో పవిత్ర స్నానాల కోసం పోటీపడ్డారు. మహాశివరాత్రి పర్వదినాన పుణ్యగిరి క్షేత్రంలో కొందరు శివరాత్రి పర్వదినాన పితృదేవతలకు అపరకర్మలు చేసి, పిండప్రధాన క్రతువులు చేశారు. కొందరు అస్థికల నిమజ్జనం చేయించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా డీఎస్పీ గోవిందరావు, సీఐ మురళీరావు నేతృత్వంలో 200మందికి పైగా పోలీస్ సిబ్బంది పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపారు. పుణ్యగిరి దేవస్థానం ఈఓ కె.నాగేంద్ర భక్తులకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు.



మెరకముడిదాం: శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

శివనామ స్మరణ

గజపతినగరం: మహాశివరాత్రి సందర్భంగా గజపతినగరం, పురిటిపెంట శివాలయాల్లో భక్తులు బారులు తీరారు. అర్చకులు రాంబాబు, సత్యనారాయణ పంచామృతాలతో పూజలు, అభిషేకాలను భక్తులచే చేయించారు.

శివనామస్మరణతో కిటకిటలాడిన శివాలయాలు

బొండపల్లి: మండల కేంద్రంలోని మధుర గ్రామమైన గెద్దపేట శివాలయంతో పాటు, రాచకిండాంలోని శివాలయం, నెలివాడలోని శివాలయం మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలును నిర్వహించారు. గెద్దపేట, రాచకిండాం శివాలయాలు ఆవరణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అంతటా శివనామస్మరణ

గుర్ల: మండలంలోని గుర్ల, కోటగండ్రేడు, తెట్టంగి గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు శక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. భక్తులు అభిషేకాలకు నిర్వహించారు.



ఎల్.కోట: వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న రుద్రహోమం

మార్మోగిన శివనామస్మరణ

చీపురుపల్లి: భక్తులు అత్యంత పవిత్రంగా భావించే మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని చీపురుపల్లి పట్టణంలోని శివాలయాలతో పాటు మండలంలోని మెట్టపల్లి, కర్లాం తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో క్యూ లైన్లు నిండిపోయాయి. దేవస్థానం ఆవరణలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

జామి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రమైన జామి త్రిపురాంతక స్వామి ఆలయంలో భక్తులు వేకువజాము నుంచి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జమ్మి చెట్లుకు పూజలు చేశారు. భీమసింగి, చింతాడ, ఆర్.బీ.పురం, అలమండ రైల్వేస్టేషన్, కుమరాం, విజినిగిరి తదితర గ్రామాల్లో భక్తులు శివాలయాలు దర్శించుకుని పూజలు చేశారు. భీమసింగి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు.



చీపురుపల్లి రూరల్(గరివిడి) :వెదుళ్లవలసలో భక్తులతో పోటెత్తిన సంగమేశ్వరస్వామి ఆలయం



చీపురుపల్లి: నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో కొలనులో ఉన్న శివున్ని పూజిస్తున్న భక్తులు



బొండపల్లి: గెద్దపేట శివాలయంలో బారులు తీరిన భక్తులు

శంభో శంకర

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి, జిన్నాం గ్రామాలలో ఉన్న శివాలయాలు శుక్రవారం మహాశివరాత్రిని పురష్కరించుకుని భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు రంగనాధాచార్యులు, శ్రీనివాసాచార్యులు తెల్లవారుజాము నుండే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు.

గరివిడిలో..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శివాలయాలు శుక్రవారం శివనామస్మరణతో మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పరమేశ్వరునికి పాలాభిషేకాలు, ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. దీంతో శివాలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



గంట్యాడ : పెదవేమలి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గజపతినగరం: శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు



గుర్ల: శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గజపతినగరం రూరల్: మరుపల్లి శివాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మెరకముడిదాంలో..

మెరకముడిదాం: మండల కేంద్రమైన మెరకముడిదాం, సోమలింగాపురం, సింగవరం, గర్భాం, సాతాంవలస, గొల్లవలస, యాడిక తదితర గ్రామాల్లో వెలసిన శివాలయాలు మహాశివరాత్రి సందర్భంగా శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాలన్నీ శుక్రవారం వేకువజామునుంచి భక్తులతో కిటకిటలాడాయి.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

గంట్యాడ: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామున 4 గంటల నుంచే భక్తులు శివాలయాల వద్ద బారులు తీరారు. పెదవేమలి, గంట్యాడ, సిరిపురం, తాటిపూడి, మధుపాడ, నరవ, నీలావతి, రామవరం, బుడతానపల్లి తదితర గ్రామాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.



జామి: త్రిపురాంతకస్వామికి అభిషేకాలు గావిస్తున్న అర్చకులు

కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



కమ్యూనిటీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట : మండలంలోని కొట్యాడ గ్రామంలో ఎస్సీ కాలనీ ఆవరణలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు.మండల పరిషత్‌కు మంజూరైన ఎస్సీ కార్పొరేషన్ నిధులు రూ.6లక్షలతో ఈ భవనం నిర్మించనున్నట్లు ఎంపీపీ తెలిపారు. గ్రామంలో సుమారు 50 కుటుంబాలు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నప్పటికీ గత ప్రభుత్వాల్లో కనీసం గుర్తింపులేదని ఎంపీపీ తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లక్షలాది రూపాయలు వెచ్చించి ఎస్సీ కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొట్యాడ దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు కొట్యాడ మహేష్, కొట్యాడ జగన్, ప్రముఖ న్యాయవాది కొట్యాడ అచ్చిబాబు, కరెడ్ల దేముడు, మద్దిల తాతబాబు, నాగరాజు, ఎద్దు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ 'బెల్లాన' జన్మదినోత్సవం



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు

చీపురుపల్లి: తమ అభిమాన నాయకుడు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సేవలు ప్రజలకు భవిష్యత్‌లో కూడా సంపూర్ణంగా అందేందుకు భగవంతుడు ఆశీస్సులు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకాంక్షించారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో జన్మదినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి హ్యాపీ బర్త్‌డే పెదబాబు అంటూ స్లోగన్స్ ఇచ్చారు. అనంతరం బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి ఆధ్వర్యంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ జన్మదినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, అధికార్ల శ్రీనుబాబు, ఇప్పిలి తిరుమల, మంగళగిరి శ్రీను, గిరడ రాందాసు, దాలయ్య, కింతలి మధు, ముల్లు పైడిరాజు, చందక గురునాయుడు, రేవల్ల సత్తిబాబు పాల్గొన్నారు.

10న గురుకులాల్లో ప్రవేశ పరీక్ష

చీపురుపల్లి: బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలల్లో ఐదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఈ నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు స్థానిక గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాణీశ్రీ చెప్పారు. ఈ నెల 10న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదవ తరగతిలో ప్రవేశాలకు పరీక్ష నిర్వహించనున్నామని, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా పరీక్షకు గంట ముందు, ఐడీ ప్రూఫ్‌తో పరీక్ష కేంద్రానికి హాజరవ్వాలని చెప్పారు.

పాడి రైతులకు దుప్పట్ల పంపిణీ



బానాదిలో పాడిరైతులకు దుప్పట్లుపంపిణీ చేస్తున్న సంఘ అధ్యక్షుడు, సూపర్‌వైజర్ తదితరులు

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేసే పాడి రైతులకు దుప్పట్లు శుక్రవారం పంపిణీ చేశారు. బానాది-2 పాల కేంద్రంలో పాలు సరఫరా చేస్తున్న రైతులకు ప్రోత్సాహం కింద 140 మంది రైతులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గొంప వెంకటరావు, సూపర్‌వైజర్ ఎం.నాయుడుబాబు, కార్యదర్శి కండిపల్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.

గొట్లాంలో 'గడప గడపకు సంక్షేమం'



గొట్లాంలో గడప గడపకు సంక్షేమం కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



లబ్ధిదారులకు కరపత్రాలు అందజేత

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గడప గడపకు సంక్షేమం ద్వారా అయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం, గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ, నాయకులు శుక్రవారం అందజేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా ఏఏ కుటుంబాలు ఎంత లబ్ధిని పొందారో తెలియజేసే కరపత్రాలను అందజేసి, అనంతరం వారు ఈ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత ఎంత లబ్ధి పొందారో వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మండల రామునాయుడు, పిళ్లా లక్ష్మి, రామప్పడు, గోవింద్, జనార్దనరావు, నారాయణరావు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

దత్తిరాజేరులో...

దత్తిరాజేరు: గడప గడపకు సంక్షేమం పేరిట ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు కలిగిన మేలు వివరిస్తూ వలంటీర్లు, బూత్ కమిటీ సభ్యులు, నాయకులు కరపత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం దత్తిరాజేరులో జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, వంగరలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు దత్తి చిరంజీవి, పలు గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు కరపత్రాలను ప్రజలకు అందజేశారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



కనకరత్నంకు సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస : మండలంలోని కొత్తవలస మేజరు పంచాయతీ మంగళవీధికి చెందిన వెలమరెడ్డి కనకరత్నంకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.50వేల చెక్కును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. కనకరత్నం భర్త రాము రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందగా చేతికందొచ్చిన కొడుకు కూడా మృతి చెందాడు. దీంతో కనకరత్నం ఆర్థికంగా చితికిపోయి ఒంటరిగా మిగిలిపోయింది. దీంతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చొరవతో సీఎం సహాయనిధి నుంచి సాయం అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, ఎంపీపీ ఎన్.గోపెమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, కొత్తవలస మేజర్ పంచాయతీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

అఖిల భారత తెలుగు సాహితీ సదస్సుకు 'కిలారి'



గౌరినాయుడు

లక్కవరపుకోట:తూర్పు గోదావరి జిల్లా కాకినాడ పట్టణంలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవ సందర్భంగా ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత తెలుగు సాహితీ సదస్సుకు మండలంలోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీవేత్త డాక్టర్ కిలారి గౌరినాయుడుకి ఆహ్వానం అందినట్టు ఆయన శుక్రవారం తెలిపారు. సదస్సులో విద్యా రంగంలో మాతృభాష ఆవశ్యకత అనే అంశంపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, సాహితీ ప్రముఖులు, కళాకారులు, స్నేహితులు గౌరినాయుడుకి అభినందనలు తెలిపారు.

మగువా.. నీకు వందనం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల మహిళలను సత్కరించారు. కేక్ కట్ చేశారు. సమాజంలో మహిళల కీర్తిని చెబుతూ పలువురు వారి ప్రాముఖ్యతను వివరించారు. మహిళతోనే సమాజాభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహిళలు ఎక్కడైతే అభివృద్ధి చెందుతారో అక్కడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. మహిళ దినోత్సవంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



ఎస్.కోట: ఏఎల్‌జే షోరూమ్‌లో మహిళా దినోత్సవ వేడుకకు హాజరైన మహిళలు



కొత్తవలస: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా ప్రజాప్రతినిధుల మధ్య కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



బొండపల్లి: మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు, ఉద్యోగులు



లక్కవరపుకోట : మహాత్మా జ్యోతిబా పూలే ఆశ్రమ పాఠశాలలో వీరవణితల ఏకపాత్రాభినయం చేస్తున్న విద్యార్థినిలు



గంట్యాద: రామవరం గ్రామంలో మహిళలను సన్మానిస్తున్న ఎంపీపీ హైమావతి



ఎస్.కోట డిపోలో మహిళా కండక్టర్లకు బహుమతులు అందజేస్తున్న డీపీటీఓ డిపిటిఓ అప్పలనారాయణ తదితరులు